మైనింగ్ మాయ..!

- గులాబీ నేతల గుప్పిట్లో దందా
- ఎట్టకేలకు ఓ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధిపై కేసు
- అయినా.. గోప్యత పాటిస్తున్న అధికారులు
- మంత్రి ఆదేశించినా మారని తీరు

అక్రమ క్రషింగ్‌పై విచారణ సరే.. వివరాలేవి?

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 15 : సంగారెడ్డి జిల్లాలో మైనింగ్ దందాను అరికట్టేందుకు విచారణ జరుపుతున్న అధికారులు అక్రమ క్రషింగ్, యజమాన్య వివరాలను మాత్రం బహిర్గతపరిచేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. జిల్లాలో మైనింగ్ మాఫియాను రూపుమాపాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులు ఆదేశించగా, గత నెలలో కలెక్టర్ వల్లూరు క్రాంతి రెవెన్యూ, పోలీస్, మైనింగ్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ టాస్క్‌ఫోర్స్ అధికారులు పటాన్‌చెరు, కంది మండలాల్లో కొనసాగుతున్న అక్రమ మైనింగ్‌పై విచారణ జరుపుతున్నారు. మైనింగ్ కాంట్రాక్టు పొందిన వారు ఎంత మేర భూమిని తీసుకున్నారు? మైనింగ్ చేస్తున్న పరిధి ఎంత? అన్న అంశాలను క్షేత్రస్థాయిలో విచారిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో లీజుకు తీసుకున్న మైనింగ్ గురించి లోతుగా పరిశీలించిన అధికారులు ఎట్టకేలకు లక్డారంలో ఓ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధి అక్రమంగా సాగిస్తున్న క్రషర్లను, కంకర కోసం చేస్తున్న అక్రమ బ్లాస్టింగ్‌లను గుర్తించి ఉక్కుపాదం మోపారు.



ఎందుకింత గోప్యత

జిల్లాలోని పటాన్‌చెరు, కంది మండలాల్లో మైనింగ్ దందా చేస్తున్న వారిలో ఎక్కువ మంది బీఆర్ఎస్ నాయకులే ఉన్నారని వినికిడి. నిబంధనలను ఉల్లంఘించి మైనింగ్ కొనసాగిస్తున్న అందరిపై కొరడా ఝుళిపించడంలో అధికారులు వెనకడుగు వేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంతవరకు లక్డారంలో అక్రమ మైనింగ్ చేస్తున్న ఓ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధిపై మాత్రమే చర్యలు తీసుకున్నారు. సదరు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధిపై కేసు నమోదు చేయగా, వివరాలను వెల్లడించడంలో మాత్రం అధికారులు ఎందుకో గోప్యత పాటిస్తున్నారు. నమోదైన కేసులు, సెక్షన్ల గురించి పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఎవరూ వెల్లడించడం లేదు. అయితే సదరు ప్రజాప్రతినిధిపై బెయిలబుల్ సెక్షన్లు ఉన్నా అరెస్ట్ చేసి, బెయిల్ ఇవ్వవచ్చని ఒక జిల్లా పోలీస్ అధికారి తెలిపారు. అయితే ఇంతవరకు సదరు ప్రజాప్రతినిధిని అరెస్ట్ చేయడం కానీ, ఇతరత్రా చర్యలు కానీ తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఇక జిల్లా మైనింగ్ అధికారి మాత్రం ఎప్పుడూ క్షేత్రస్థాయి పరిశీలనలో ఉన్నానని జవాబిస్తూ దాటవేస్తున్నారు. అయితే ఆయన జరిపిన పరిశీలన ఏమిటో ఎవరికీ తెలియడం లేదు.

అధికారుల తీరు ప్రశ్నార్థకం

అక్రమ మైనింగ్ వ్యవహారంలో కఠినంగా వ్యవహరించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించినా అధికారులు మాత్రం బీఆర్ఎస్ నాయకులనే వెనకేసుకువస్తుండడం తమకు ఆశ్చర్యం కలిగిస్తున్నదని జిల్లా కాంగ్రెస్ నాయకుడొకరు వాఖ్యానించారు. సంగారెడ్డిలో మూడు రోజుల కిందట జరిగిన అధికారిక సమావేశంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ మైనింగ్ దందాను అరికట్టడంలో చొరవ చూపడం లేదంటూ సంగారెడ్డి ఆర్డీవోపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అయినా అధికారుల తీరులో మార్పు కనిపించడం లేదన్న విషయం మంత్రి దృష్టికి వెళ్లినట్టు తెలిసింది. ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న ఒకరిద్దరు అధికారుల బదిలీలు జరిగే అవకాశాలు లేకపోలేదని తెలుస్తున్నది.

సేవాలాల్ మహరాజ్‌కీ జై

బంజారాల ఆరాధ్య గురువు సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతిని పురస్కరించుకుని బుధవారం మెదక్, సంగారెడ్డి జిల్లాలో పలుచోట్ల శోభాయాత్రలను నిర్వహించారు. భోగ్‌బండార్ నిర్వహించి సేవాలాల్ బోధనలను గుర్తుచేసుకున్నారు. ఆయా చోట్ల నిర్వహించిన అధికారిక కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు.



సంగారెడ్డిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో బంజార నృత్యం చేస్తున్న బాలిక

సంగారెడ్డిలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



సేవాలాల్ జయంతి కార్యక్రమంలో పూజలు చేస్తున్న మెదక్ కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ రమేష్

ఏడుపాయల కీర్తి ఎల్లలు దాటాలి

- జాతరలో భక్తులకు అసౌకర్యం కలగొద్దు
- గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేయాలి
- మెదక్ కలెక్టర్ రాజర్షిషా



మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 15 : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఏడుపాయల జాతరకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏడుపాయల జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే నెల మార్చి 8 నుంచి మూడు రోజుల పాటు జరిగే మహాశివరాత్రి జాతరకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాదాపు 10 లక్షల వరకు భక్తులు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మార్చి 8న శివరాత్రి జాగరణ, 9న బండ్లు, 10న రథోత్సవం ఉంటుందన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు పోతంశెట్టిపల్లి, నాగ్సాన్‌పల్లి ప్రాంతాల ద్వారా భక్తులు వచ్చే అవకాశమున్నందున ట్రాఫిక్, పార్కింగ్‌కు ఇబ్బందులు కలుగుండా చూడాలన్నారు. నీటి ప్రమాద ప్రాంతాలను గుర్తించి గట్టి పోలీస్ బందోబస్తు, బారికేడ్లు, సీసీ కెమెరాలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పోలీస్, ఆర్అండ్‌బీ, నీటి పారుదల అధికారులకు సూచించారు. భక్తులకు తాగునీటి కుళాయిలు, ట్యాంకర్లు ఏర్పాటుతో పాటు స్నానాల షవర్లు, మహిళలు దుస్తులను మార్చుకొనుటకు గదులు, శౌచాలయాలు ఏర్పాటు చేయాలన్నారు. గత జాతరలో శానిటేషన్ బాగా పనిచేశారని, ఈసారి అవసరమైన ప్రాంతాల్లో డ్రమ్ములు ఏర్పాటు చేసి రోజువారీ చెత్తను తొలగిస్తూ ట్రాక్టర్ల ద్వారా తరలించాలన్నారు. జిల్లా వైద్యాధికారులు ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేస్తూ- అవసరమైన మందులతోపాటు అత్యవసరంగా రెండు 108 అంబులెన్స్ వాహనాలు సిద్ధంగా ఉంచాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చేందుకు వీలుగా ఆర్టీసీ బస్సుల నడపాలని, బస్టాండ్ నుంచి దేవస్థానం వరకు ఉచిత బస్సులు నడపాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అవసరమైన ఫీడర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్పీ బాలస్వామి, అదనపు కలెక్టర్ రమేష్, ఆయల చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి, వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పరిశ్రమలో తనిఖీలు చేస్తున్న కలెక్టర్

పాశమైలారంలో మూడు పరిశ్రమలు సీజ్

పాశమైలారంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేష్ పలు పరిశ్రమల్లో తనిఖీల నిర్వహించగా ఈ సందర్భంగా నిబంధనలు పాటించని మూడు పరిశ్రమలను సీజ్ చేశారు. సాలుబ్రీయాస్, విరల్ సింథటిక్, వెంకర్ కెమికల్స్ పరిశ్రమల్లో అగ్నిమాపక పరికరాలను అమర్చకపోవడంతో చర్యలు తీసుకున్నారు.

నిబంధనలు పాటించకపోతే పరిశ్రమలపై కఠిన చర్యలు

- తీవ్ర ఉల్లంఘనలు ఉంటే మూసివేత
- ప్రాపర్టీ ట్యాక్స్ కట్టని కంపెనీలపై కొరడా
- కార్మికుల కోసం లేబర్ గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు
- టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో రెస్క్యూ కమిటీ
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 15 : నిబంధనలు పాటించని పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి హెచ్చరించారు. పాశమైలారంలో మంగళవారం రాత్రి ప్రమాదం జరిగిన సాలిబరీస్ పరిశ్రమను ఎస్పీ రూపేష్‌తో కలిసి కలెక్టర్ గురువారం పరిశీలించారు. వైటాల్, వెంకర్ కెమికల్, అరబిందో పరిశ్రమలను తనిఖీ చేశారు. అరబిందో పరిశ్రమలో ఫైర్ సేఫ్టీ నిబంధనలకు సంబంధించి సర్‌ప్రైజ్ మాక్ డ్రిల్ చేయించారు. అనంతరం ఐలా భవనంలో ఐలా ప్రతినిధులు, టీఎస్ఐఐసీ, పరిశ్రమల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అగ్నిమాపక, కార్మిక, వైద్య ఆరోగ్య తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అన్ని కంపెనీలను తనిఖీ చేసి, పూర్తి నివేదికను అందజేయాలని ఆదేశించారు. కార్మికులకు ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించేలా లేబర్ గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేయాలని, వాటిని కార్మిక సంఘాలు, టీఎస్ఐఐసీ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఐలా అనుబంధ శాఖల అధికారులతో రెస్క్యూ కమిటీ ఏర్పాటు చేసి, అన్ని పరిశ్రమలను తనిఖీ చేసి ఫైర్ సేఫ్టీ తదితర నిబంధనలు పాటిస్తున్నాయా లేదా పరిశీలించాలని, నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘిస్తున్న పరిశ్రమలను వెంటనే మూసివేయాలని ఆమె ఆదేశించారు. పరిశ్రమలో ఎంత మంది కార్మికులు పనిచేస్తున్నారు, భవన సెట్ బ్యాక్, కార్మిక సంక్షేమం అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన కంపెనీ యజమాని, అధికారుల వివరాలు, ఫోన్ నంబర్లను కంపెనీ ఎదుట, ఆఫీస్ గోడపై పెట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు, ప్రాపర్టీ ట్యాక్స్ కట్టని కంపెనీలను మూసి వేయించాలని, కట్టిన తర్వాతే ఓపెన్ చేయాలని టీఎస్ఐఐసీ అధికారులకు సూచించారు. ఆయా పరిశ్రమలు పీసీబీ నిబంధనల మేరకు పనిచేసేలా చూడాలని, నిర్లక్ష్యం వహిస్తున్న పరిశ్రమల యజమానులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. లైసెన్స్‌లు చెక్ చేయాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలపై అవగాహన కల్పించాలని సంబంధిత అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రూపేష్, రెవెన్యూ డివిజనల్ అధికారి రవీందర్‌రెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం ప్రశాంత్, ఆయా అనుబంధ శాఖల అధికారులు, ఐలా ప్రతినిధులు, పటాన్‌చెరు డీఎస్పీ, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బదిలీలు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 15 : సంగారెడ్డి జిల్లాలో పలువురు తహసీల్దార్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కల్హేర్ తహసీల్దార్ బాలశంకర్‌ను కోహీర్‌కు, నారాయణఖేడ్ తహసీల్దార్ దేవిదాస్‌ను సంగారెడ్డికి, సూర్యాపేట జిల్లా చీవెమ్ల తహసీల్దార్ రంగారావును పటాన్‌చెరుకు బదిలీ చేశారు. పటాన్‌చెరు తహసీల్దార్ సిభాస్కర్‌ను నారాయణఖేడ్‌కు, పుల్కల్ తహసీల్దార్‌ను భాస్కర్‌కుమార్‌ను అందోల్‌కు, రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ తహసీల్దార్ కే.కృష్ణను పుల్కల్‌కు, వికారాబాద్ జిల్లా బషీరాబాద్ తహసీల్దార్ వెంకటస్వామిని మనూర్‌కు, హైదరాబాద్‌లోని అంబర్‌పేట తహసీల్దార్ భిక్షపతిని జిన్నారం మండలానికి బదిలీ చేశారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ ఏవో పి.రాధను అమీన్‌పూర్‌కు, మనూర్ తహసీల్దార్ మల్లేశ్‌కుమార్‌ను జహీరాబాద్ ఆర్డీవో కార్యాలయానికి బదిలీ చేశారు. సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సూపరింటెండెంట్ (హెచ్-విభాగం)ను సంగారెడ్డి కలెక్టరేట్‌లోని జీ విభాగం సూపరింటెండెంట్‌గా, కోహీర్ తహసీల్దార్ శాంతకుమారిని సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఏవోగా, సంగారెడ్డి తహసీల్దార్ ఫర్హీన్ షేక్‌ను హత్నూర మండలానికి, అందోల్ తహసీల్దార్ ఆంథోనిని అందోల్ ఆర్డీవో కార్యాలయానికి, అమీన్‌పూర్ తహసీల్దార్ గౌరీవత్సలను సంగారెడ్డి కలెక్టరేట్‌లోని హెచ్ విభాగం సూపరింటెండెంట్‌గా, నిజాంపేట తహసీల్దార్ రాజాగణేష్‌ను కల్హేర్ మండలానికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది.

మల్లన్న ఆలయ మోడల్‌లోనే కొమురవెల్లి రైల్వే హాల్ట్‌స్టేషన్

- ప్రధాని నరేంద్రమోదీ కృషితో సాకారం
- కేంద్ర పర్యాటక,సాంస్కృతికశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి
- హాజరైన మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్

చేర్యాల, ఫిబ్రవరి 15 : కోట్లాది మంది భక్తుల ఇలవేల్పుగా, తెలంగాణ, జానపద సంస్కృతికి ప్రతిబింబంగా విలసిల్లుతున్న మల్లన్న ఆలయ శోభ, సంప్రదాయం ఉట్టిపడేలా కొమురవెల్లి రైల్వే హాల్ట్‌స్టేషన్‌ను అత్యద్భుతంగా నిర్మించేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య ప్రాంత అభివృద్ధిశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. కొమురవెల్లి గ్రామశివారులోని రైల్వేగేట్ సమీపంలో చేపట్టనున్న రైల్వే హాల్ట్‌స్టేషన్ నిర్మాణానికి గురువారం ఆయన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడారు. కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోదీ చొరవతోనే కొమురవెల్లిలో రైల్వే హాల్ట్‌స్టేషన్ సాకారమైందని తెలిపారు. రైల్వే హాల్ట్‌స్టేషన్‌ను మల్లన్న ఆలయ మోడల్‌లో తీర్చిదిద్దడంతో పాటు ప్రయాణికులకు సౌకర్యంగా ప్లాట్‌ఫాం, బుకింగ్ కౌంటర్, వెయిటింగ్ హాల్, ఉచిత వైఫై సౌకర్యంతో త్వరితగతిన అందుబాటులోకి తీసుకురానున్నామని పేర్కొన్నారు. కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వేలైన్ నిర్మాణంతో రైతుల ఉత్పత్తులను సరఫరా చేయనున్నామని ఆయన స్పష్టం చేశారు.



మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్, కిషన్‌రెడ్డి, లక్ష్మణ్

ఇంటికి తిరిగి వచ్చినట్లుంది.. : మధ్యప్రదేశ్ సీఎం

కొమురవెల్లి మల్లన్న చెంత నిర్మాణం కాబోతున్న రైల్వే హాల్ట్‌స్టేషన్ భూమిపూజ లో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని, తాను తన ఇంటికి తిరిగివచ్చిన అనుభూతి పొందుతున్నానని మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ అన్నారు. మల్లన్న స్టేషన్ ద్వారా ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూరుతుందన్నారు. సభలో పలుమార్లు మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్, కిషన్‌రెడ్డి ప్రసంగంలో, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు పేరు ప్రస్తావించడంతో అభిమానులు ఈలలు, కేకలతో అభిమానం చాటుకున్నారు. మోహన్‌యాదవ్ కొమురవెల్లి మల్లన్న ఆలయాన్ని సందర్శించారు. ముఖమండపంలో పట్నం వేసి మొక్కులు తీర్చుకున్నారు.

బడిబాట వదిలి... బతుకు వేట!

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపడుతూనే ఉన్నది. అయినా అక్కడక్కడా ఇంకా బాలలు పనిచేస్తూ కనిపిస్తూనే ఉన్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి చౌరస్తా సమీపంలో చెత్త ఏరుకుని, అమ్మకానికి తీసుకెళ్తున్న బాలికను చిత్రంలో చూడొచ్చు.

- ఆంధ్రజ్యోతి సంగారెడ్డి స్టాఫ్ ఫొటోగ్రాఫర్



దగా పడ్డ మహిళలకు అండగా భరోసా కేంద్రాలు



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎమ్మెల్యే రోహిత్‌రావు, కలెక్టర్ రాజర్షిషా, డీఐజీ రెమా రాజేశ్వరీ

- స్నేహపూర్వక వాతావరణంలో కౌన్సెలింగ్
- ఆధునాతన సౌకర్యాలతో నూతన భవనం ఏర్పాటు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 15 : సమాజంలో దగా పడ్డ మహిళలకు అండగా నిలవడానికి ప్రభుత్వం భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. మెదక్ పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో రూ.2 కోట్లతో నూతనంగా నిర్మించిన భరోసా కేంద్రం నూతన భవనాన్ని, షీటీం కార్యాలయాన్ని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుతో కలిసి గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ అత్యాచారాలు, చిత్రహింసలకు గురైన మహిళలు, చిన్నారులకు సహాయం చేసేందుకు భరోసా కేంద్రాలు అండగా నిలుస్తున్నామని తెలిపారు. మానసిక వేధింపులకు గురికాకుండా స్వాంతన చేకూర్చే విధంగా పనిచేస్తాయన్నారు. 2022 ఆగస్టు నుంచి ఇప్పటివరకు 135 కేసులు నమోదయ్యాయని, వారికి రూ.27 లక్షలకుపైగా ఆర్థిక సహాయం అందజేసినట్లు మంత్రి తెలిపారు. ఈ కేంద్రాల్లో స్నేహపూర్వక వాతావరణంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారని చెప్పారు. మహిళా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన స్పష్టంచేశారు. భరోసా కేంద్రాలు లేని జిల్లాలో త్వరలో ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కేంద్రంలో ఆవరణలో మొక్కలను నాటి నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా, డీఐజీ రెమా రాజేశ్వరీ, ఎస్పీ బాలస్వామి, భరోసా ఇన్‌చార్జి రాజరత్నం, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నంగునూరు, ఫిబ్రవరి 15: ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో దేశిరెడ్డి తెలిపారు. గురువారం మిట్టపల్లి సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో నంగునూరు మండలం నర్మెట్ట కస్తూర్బా గాంధీ హాస్టల్‌లో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన 213 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో పద్మ, సురభి హాస్పిటల్ మార్కెటింగ్ ఇన్‌చార్జి చరణ్, డి.రాజు పాల్గొన్నారు.







నేడు దేశవ్యాప్త బంద్

- వామపక్ష ఐక్య కార్మిక సంఘాల పిలుపు
- పోరాటానికి విద్యార్థి సంఘాల మద్దతు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 15: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా, రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నేడు దేశవ్యాప్త సమ్మెను, గ్రామీణ భారత్ బంద్‌ను నిర్వహించనున్నారు. 15 రోజుల నుంచి దేశవ్యాప్త కార్మిక సమ్మె గ్రామీణ భారత్ బంద్ జయప్రదం కోసం వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను చేపట్టారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజావ్యతిరేక బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు శ్రామిక ప్రజలను సమాయత్తం చేయాలన్నారు. నేడు జరగబోయే దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఆయా కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.



గజ్వేల్‌లోని గ్రామాల్లో సమ్మె నోటీసును అతికిస్తున్న సీఐటీయూ నాయకులు



సంగారెడ్డిలోని సమావేశంలో మాట్లాడుతున్న సాయిలు

కేంద్రంలో బీజేపీ మతోన్మాద పాలన సాగిస్తోంది: సీపీఎం

● మల్లారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి

దేశంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక వర్గాలను విస్మరించి, విద్యార్థి రంగాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మకానికి పెడుతూ మతోన్మాద పాలన సాగిస్తోంది. భవిష్యత్తులో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడానికి అనేక పోరాటాలను నిర్వహించే అవకాశం ఉన్నది.

●సంగారెడ్డి రూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బందులో అన్ని వర్గాల వారు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ. సాయిలు అన్నారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో గురువారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు యాదగిరి, కొండల్‌రెడ్డి, అశోక్, రాములు తదితరులు పాల్గొన్నారు.

●నారాయణఖేడ్: రైతులు, కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మాణిక్ కోరారు. గురువారం నారాయణఖేడ్‌లో సమ్మె పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘంనాయకులు బాబురావు, అరుణ్, పవన్‌రాజు, మాణిక్యంస్వామి పాల్గొన్నారు.

●గజ్వేల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం జరుగు సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య కార్మికులకు, ప్రజలకు, రైతాంగానికి పిలుపునిచ్చారు. గజ్వేల్ మండల పరిధిలోని కొడకండ్ల, ప్రజ్ఞాపూర్ గ్రామాల్లోని పలు పరిశ్రమల వద్ద సమ్మె నోటీసులు అతికించారు. అనంతరం కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఉత్పత్తి చేసే శ్రామికులను నష్టం చేస్తూ కార్పొరేట్, పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలను మారుస్తూ పేద కార్మికులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, రాయితీలను రద్దు చేస్తున్నదన్నారు. నేడు జరిగే సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వారితో సీఐటీయూ నాయకులు వెంకటాచారీ, కృష్ణ ఉన్నారు.

సమ్మెకు బీఎంఎస్ దూరం


●సంగారెడ్డి అర్బన్: రాజకీయ సమ్మెకు బీఎంఎస్ దూరంగా ఉంటుందని బీఎంఎస్ జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డిలోని స్థానిక కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 16 న చేపట్టనున్న సమ్మె కార్మికులు, ప్రజల కోసం కాదని రాజకీయ స్వలాభం కోసం అవకాశ రాజకీయాల కోసం సమ్మె అని ఆరోపించారు. రాష్ట్ర పరిధిలోని కార్మికుల సమస్యను కేంద్రం ఎలా పరిష్కరిస్తుందని కార్మికులకు వివరించాల్సిన అవసరముందన్నారు. గత మూడు సంవత్సరాలకు ఒక సారి కనీస వేతనాలు సవరించాలన్న నిబంధన ఉంటే దానిని తుంగలో తొక్కి ఇప్పటి వరకు అమలు చేయలేదని, ఇలాంటివి ఈ రాజకీయ కార్మిక సంఘాలకు కనపడవా అన్ని ప్రశ్నించారు. రాజకీయ కార్మిక సంఘాలు ప్రభుత్వాలకు వత్తాసు పలుకుతూ పబ్బం గడుపుతున్నాయని, రెక్కాడితే డొక్కాడని కార్మికులకు రాజకీయ రంగు పులుముతూ కులమతాలకు ప్రాంతీయ విభేదాలను సృష్టించి కార్మికులను విడదీయాలని చేస్తున్నారని, వీటిని తిప్పికొట్టాలని ఆయన హితవుపలికారు. ఈ సమావేశంలో బీఎంఎస్ నాయకులు, పాల్గొన్నారు.

'ప్రమోషన్లకు దూరం చేయడం దారుణం'

వెల్దుర్తి, ఫిబ్రవరి15: దశాబ్దాల అనుభవంతో విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి పాటు పడుతున్న ఉపాధ్యాయులకు టెట్ నిబంధనను చూపిస్తూ, సీనియర్ ఉపాధ్యాయులను ప్రమోషన్లకు దూరం చేయడం దారుణమని ఎస్‌జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.. గత ప్రభుత్వ హయాంలో ఎన్‌సీఈఆర్‌టీ నిబంధనలు ఉన్నప్పటికీ ఒకసారి అరకొర పదోన్నతులు కూడా జరిగాయన్నారు. ప్రభుత్వ అధికారులు టెట్ అనివార్యమని ఎక్కడా ఎప్పుడు సూచించకపోవడం ఎవరి తప్పిదమన్నారు.

ఇంగ్లిష్ డ్రామా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొండపాక, ఫిబ్రవరి 15: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా వారు ఇందిరానగర్ పాఠశాలలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి ఇంగ్లిష్ డ్రామా పోటీల్లో కొండపాక మండలం దుద్దెడ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం పొందారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు. డ్రామా పోటీలకు విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఇంగ్లిష్ ఉపాధ్యాయులు కిరణ్మయి, చంద్రభాను, యాదగిరిలను అభినందించారు.





ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి



దుర్గమ్మ(ఫైల్)

నర్సాపూర్, ఫిబ్రవరి 15: మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మరణించింది. ఈ సంఘటన నర్సాపూర్ సమీపంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం నర్సాపూర్ పట్టణంలోని సునీతారెడ్డి కాలనీలో నివసించే సంకు దుర్గమ్మ(45) అనే మహిళ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నది. గురువారం ఉదయం నర్సాపూర్ పట్టణ సమీపంలోని హంసాఫర్ రెస్టారెంటు సమీపంలో మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై రోడ్డుదాటుతున్న క్రమంలో మెదక్ నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఆమెను ఢీ కొనడంతో తలకు తీవ్ర గాయమై రక్తస్రావంతో అక్కడికక్కడే మరణించింది. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యవసాయ పొలంలో పడి యువరైతు మృతి

మిరుదొడ్డి, ఫిబ్రవరి15: వ్యవసాయ పొలం వద్ద ఒడ్డుపై నుంచి పొలంలో జారిపడి శ్రీకాంత్ (30)అనే యువరైతు మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలో చోటు చేసుకున్నది. అక్బర్‌పేట-భూంపల్లి ఎస్ఐ భువనేశ్వర్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం....గ్రామానికి చెందిన బైండ్ల శ్రీకాంత్ బుధవారం రాత్రి వ్యవసాయపొలం వద్దకు వెళ్లాడు. అర్థరాత్రి అయినా శ్రీకాంత్ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గ్రామంలో వెతికారు. అనంతరం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చూడగా, పొలంలో బొర్లపడి మృతిచెంది ఉండడని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గాజులపల్లిలో..



రాంరెడ్డి(ఫైల్)

రాయపోల్, ఫిబ్రవరి 15: పొలంలో పడి ఓ రైతు మృతి చెందిన సంఘటన దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకున్నది. బాధిత కుటుంబసభ్యులు, ఎస్ఐ శ్రీరాం ప్రేమ్‌దీప్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గాజులపల్లికి చెందిన పోతుగంటి రాంరెడ్డి(45) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజూమాదిరిగానే బుధవారం ఉదయం గ్రామ శివారులో ఉన్న పొలం వద్దకు వెళ్ళాడు. ఆయన భార్య కూలీ పనికి వెళ్లింది. ఆమె సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో భర్త కనిపించలేదు. దీంతో ఆమె భర్తకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఈ విషయాన్ని గ్రామస్థులకు చెప్పి పొలం వద్దకు వెళ్లి చూసిరమ్మని కోరింది. వారు పొలం వద్దకు వెళ్లి చూడగా రాంరెడ్డి పొలంలోని బురదలో బోర్లా పడిపోయి మృతి చెంది కనిపించాడు. వెంటనే వారు ఆయన కుటుంబసభ్యులకు ఫోన్ చేసి విషయాన్ని తెలిపారు. మృతుని భార్య సునిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్పార్క్ కుంగ్‌ఫూలో సత్తాచాటిన విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 15: డ్రాగన్ ఫైటర్ మార్షలార్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన 3వ ఇంటర్నేషనల్ ఓపెన్ టూ ఆల్ కరాటే కుంగ్‌ఫూ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సిద్దిపేట పట్టణానికి చెందిన ఎస్ఆర్ డీజీ పాఠశాల విద్యార్థులు స్పార్క్ కుంగ్‌ఫూలో పాల్గొని పతకాలు సాధించారు. కటాస్ విభాగంలో మొదటి బహుమతి శ్రీయాన్స్, రెండో బహుమతి అద్వైత్, రాము, కృతిక్ సాయివర్మ, మూడో బహుమతి శరణ్య, హరిహరను, స్పారింగ్ విభాగంలో ప్రథమ బహుమతి అభినయ్ గెలుపొందారు. వీరిని పాఠశాల యాజమాన్యం, స్పార్క్ కుంగ్ ఫూ చీఫ్ కోచ్ రఘునందన్ రెడ్డి, శిక్షకులు జి.బాలు అభినందించారు.

టిప్పర్ బోల్తా పడి డ్రైవర్ మృతి

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 15: కంకర టిప్పర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన సిద్దిపేట రూరల్ మండలంలోని ఇర్కోడ్ గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకున్నది. సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట రామయంపేట రహదారి నిర్మాణంలో భాగంగా ఎస్ఎల్ఎంఐ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన భీమ్ శర్మ(40) శుక్రవారం కంకరను అన్‌లోడ్ చేస్తుండగా హైడ్రాలిక్ విరిగి టిప్పర్ బోల్తా పడింది. దాంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తోటి డ్రైవర్ అనిల్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా సేవాలాల్ జయంతి

గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతిని గురువారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. భవానీ సేవాలాల్ మందిరాల వద్ద భోగ్‌భండార్ నిర్వహించి, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. సేవాలాల్ చిత్ర పటాలతో నృత్యాలు చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు.

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 15: సంగారెడ్డి పట్టణంలో గిరిజనులు బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ పరిధిలోని గణేష్‌నగర్‌లో గల సేవాలాల్ మహరాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సేవాలాల్ చిత్ర పటానికి పూల మాలలు వేసి పూజలు చేశారు.

● **మెదక్ అర్బన్:** జిల్లా కేంద్రంలో సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ రమేష్ హాజ్రై సేవాలాల్ చిత్రటాలకు పూల మాలలు వేసి పూజలు నిర్వహించారు.

● **నర్సాపూర్/శివ్వంపేట:** నర్సాపూర్‌లో గిరిజన సంఘాలు, గిరిజన ఎంప్లాయిస్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. గిరిజనులు నృత్యాలు చేస్తూ భవాని మాత ఆలయం వరకు ర్యాలీగా వెళ్లి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్, డీసీసీ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సుహాసినిరెడ్డి, ఎంపీపీ జ్యోతిసురేష్‌నాయక్ పాల్గొన్నారు. శివ్వంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జడ్పీటీసీ మహేష్ గుప్తా, కాంగ్రెస్ నాయకులు నవీన్‌గుప్తా, కమలపూల్ సింగ్, పార్టీ మండలాధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు చంద్రాగౌడ్, గోపి, రమణాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● మాసాయిపేట: రామాంతపూర్ తండాలో సంత్ సేవాలాల్ మందిరంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోపీనాయక్ ఉన్నారు.

● **జహీరాబాద్:** జహీరాబాద్‌లో సంత్‌సేవాలాల్ జయంతి ఉత్సవాలను ఉత్సవకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బంజారాభవన్ వద్ద భోగ్‌బండార్ పేరుతో జెండాను ఆవిష్కరించారు. దన్నూర ఆశ్రమ పీఠాధిపతి గోవింద్ మహరాజ్, సేవాలాల్ చిత్రపటాల శోభయాత్ర నిర్వహించారు. విద్యార్థులు పాల్గొని సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో దన్నూర ఆశ్రమ పీఠాధిపతి గోవింద్ మహరాజ్, బీఎస్ఎన్ఎల్ డైరెక్టర్ శంకర్‌నాయక్, టీ బేస్ రాష్ట్ర నాయకులు తులసీరాం రాథోడ్, నాయకులు ప్రేమ్‌సింగ్, కిషన్‌పవార్, మోతీరాం, శ్రీనివాస్‌నాయక్, వాసునాయక్, సంజీవ్, హీరురాథోడ్, దేవిదాస్, గోపాల్‌బానోత్, తుకారం, డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

● **నారాయణఖేడ్:** ఖేడ్‌లో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ఇంటి ఆవరణలో భోగ్ భండార్ నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు ఆనంద్ స్వరూప్ షెట్కార్, దారం శంకర్, గిరిజన సంఘాల నాయకులు రాంచందర్, దేవిసింగ్, గిరిధర్ చౌహాన్, నెహ్రూనాయక్ పాల్గొన్నారు. జహీరాబాద్ మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్ ఇంటి ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జితేందర్‌నాథ్ షెట్కార్, చందర్‌నాయక్, మారుతినాయక్ పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు రజనీకాంత్, రాథోడ్ సంతోష్, సర్దార్, రాజునాయక్ పాల్గొన్నారు. సేవాలాల్ చౌక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు. జర్నలిస్టు కాలనీలోని మాత ఆలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. నిజాంపేటలో నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు సాగర్ షెట్కార్, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కూతురు శ్రేయారెడ్డి పాల్గొన్నారు.

● **మనూరు:** మనూరుతో పాటు వివిధ గిరిజన తండాల్లో ఘనంగా సేవాలాల్ జయంతిని నిర్వహించారు. మనూరులోని ఎస్సీ బాలుర వసతి గృహంలో వార్డెన్ రాజురెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

● **కంగ్టి:** కంగ్టితో పాటు గిరిజన తండాల్లో సేవాలాల్ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

● **నాగల్‌గిద్ద:** మండల పరిధిలోని మేగ్యాతండా, గంగారాంతండా, కుబతండా గ్రామాల్లో సేవాలాల్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. అనంతరం భోగ్ భండార్ నిర్వహించారు. కరసగుత్తిలో బైక్ ర్యాలీ తీశారు.


శివ్వంపేటలో సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి


జహీరాబాద్‌లో నిర్వహించిన శోభయాత్రలో చిన్నారుల నృత్య ప్రదర్శన

● **రేగోడు:** రేగోడు పట్టణంతో పాటు మండలంలోని తండాల్లో సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. రేగోడులో గిరిజనులు ర్యాలీ తీసి, రేగోడు పాఠశాల చౌరస్తా వద్ద సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ చేసి, గద్దెను నిర్మించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు పీర్యా నాయక్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు సంగ్యా నాయక్, రమేష్ నాయక్, టీచర్ లక్ష్మణ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దిగంబర్‌రావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యాంరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సంగమేశ్వర్, శంకరప్ప, నాగేందర్‌రావు పాల్గొన్నారు.

● **కల్హేర్/సిర్గాపూర్:** కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో గురువారం నాడు గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ఘణంగా నిరసమాజ శ్రేయస్సు కోసం చూపిన మార్గం ఆదర్శనీయం.

● **మెదక్/నిజాంపేట/పాపన్నపేట/చిన్నశంకరంపేట:** మెదక్ పట్టణం, పాపన్నపేట, నిజాంపేట మండల పరిధిలోని జెడ్‌చెరువుతండా, చిన్నశంకరంపేట మండలంలోని మిర్జాపల్లి తండా, ఖాజాపూర్ తండా, జంగరాయి తండగా, కామారం తండా గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పాల్గొన్నారు. ఆయనవెంట టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, నాయకులు ముత్యంరెడ్డి, గంగ నరేందర్, మహేందర్, మారుతి, నసీరొద్దీన్, వెంకటేష్, సేనాపతి, శ్రీను, రాంచందర్, బాబు, ముంగి దేవగిరి మహరాజ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు గౌస్, ప్రశాంత్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, బాపురెడ్డి, జీవన్‌రెడ్డి, కిష్టయ్య, శ్రీకాంత్, శ్రీనివాస్, చిన్నశంకరంపేట మాజీ ఎంపీపీ అరుణ ప్రభాకర్, జంగరాయి సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచులు రంగారావు, యాదవరావు, జనార్దన్, రాజాసింగ్ ఉన్నారు.

● **వట్‌పల్లి:** వట్‌పల్లి సేవాలాల్ మహరాజ్ చౌక్ వద్ద సర్వేశ్వరపురి అంబిక శివయోగి మహరాజ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దీప్లానాయక్, బంజారా సంఘం సభ్యులు సుభాష్‌నాయక్, రాజు, సేవానాయక్, సురేష్‌నాయక్ అనిల్‌నాయక్ పాల్గొన్నారు.

● **తూప్రాన్:** తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం వద్ద సేవాలాల్ విగ్రహం ఏర్పాటు చేసి హోమం, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా లంబాడీ హక్కుల వేదిక కన్వీనర్ రాథోడ్ జైపాల్, మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ గడప దేవేందర్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ్మనాయక్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున్‌గౌడ్, గడ్డం ప్రశాంత్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. అమర్‌సింగ్, ఏఎస్ఐ కిషన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

● **పెద్దశంకరంపేట:** ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సేవాలాల్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా, తహసీల్దార్ గ్రేస్‌బాయ్, ఎంపీటీసీ రాజునాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మధుసూదన్, నాయకులు రాజేందర్‌గౌడ్, దేవేందర్, పెనుమాండ్ల గౌడ్, విఠల్, గోవింద్, రమేష్, సుభాష్, గోపాల్, ప్రవీణ్ పాల్గొన్నారు.

● **జిన్నారం:** జిన్నారం ఎస్టీ గురుకులంలో సేవాలాల్ జయంతిని నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్ గొప్పతనాన్ని విద్యార్థులకు ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గాయత్రి వివరించారు.

● **న్యాల్‌కల్:** మండలంలోని ముంగితండాలో వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఓంకార్‌యాదవ్ పాల్గొన్నారు.

ఆలయానికి భూమి కేటాయించాలి

శివ్వంపేట: శివ్వంపేటలో సేవాలాల్ ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ గురువారం గిరిజనులు రాస్తారోకో చేశారు. సంగారెడ్డి-తూప్రాన్ ప్రధాన రోడ్డుపై గంటకు పైగా బైఠాయించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కల్గింది. ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎస్ఐ మహిపాల్‌రెడ్డి అక్కడకు చేరుకుని వారికి నచ్చచెప్పి ఆందళనను విరమింపజేశారు.


నాగల్‌గిద్ద మండలం మేగ్యాతండాలో నిర్వహించిన వేడుకల్లో గిరిజన మహిళలు


తూప్రాన్‌లో..


రేగోడులో..

'భూ సర్వే తర్వాతే నిర్మాణాలు చేపట్టాలి'

కంది, ఫిబ్రవరి 15: భూ సర్వే తర్వాతే నిర్మాణాలు చేపట్టాలని మండలంలోని ఇంద్రకరణ్ గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో అసైన్డ్ భూమి సమీపంలో కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపడుతుండగా గురువారం గ్రామస్థులు అడ్డుకున్నారు. నిర్మాణం జుగుతున్న భూమి కుడా అసైన్డ్ కిందకే వస్తుందని గ్రామస్థులు తెలిపారు. ఏడీ సర్వే చేపట్టే వరకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టవద్దని పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్యదర్శి ఎంఎస్ వాణి ప్రస్తుతం నిర్మాణాలు చేపడుతున్న ఇళ్లు రెండవ నంబరు సర్వేలో ఉన్నాయని స్పష్టం చేశారు. ఆ ఇళ్లకు తామే అనుమతులు ఇచ్చామని, అభ్యంతరాలు ఉంటే రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు. కాగా గతంలో రెవెన్యూ అధికారులు జరిపిన జనరల్ సర్వేతో ఉపయోగం లేదని, ఏడీ సర్వేతోనే అసలు అసైన్డ్‌భూమి తేలుతుందని, అప్పటి వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని గ్రామస్థులు అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పట్టుదలతో వ్యాపారవేత్తలుగా ఎదగవచ్చు


సంగారెడ్డిలో మాట్లాడుతున్న గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 15: మహిళా సంఘం సభ్యులు పట్టుదలతో పనిచేస్తే వ్యాపారవేత్తలుగా ఎదగవచ్చని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి అన్నారు. సంగారెడ్డిలోని మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం గ్రామైక్య సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా సంఘాల ద్వారా మహిళలకు బ్యాంకు రుణాలు, స్త్రీనిధి రుణాలతో పాటు ఇతర రుణాల ద్వారా ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలోని సెర్ప్ ఉద్యోగులు, టీపీఏలు చురుకుగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ సమావేశంలో అదనపు డీఆర్డీవో భీమయ్య, డీపీఎం రవీందర్, ఏపీఎం వెంకట్, సమతా, సత్యనారాయణ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మందులు నిల్వ చేస్తే చర్యలు

కొండాపూర్, ఫిబ్రవరి 15: అక్రమంగా మందులను నిల్వ చేస్తే చర్యలు తప్పవని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో గురువారం ఓ ఆర్ఎంపీ వద్ద రూ.50 వేలు విలువ చేసే మందులను డ్రగ్స్ నియంత్రణ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొల్లపల్లిలో ఆర్ఎంపీ వద్ద పెద్ద మొత్తంలో నిల్వ ఉంచిన మందులు స్వాధనీం చేసుకున్నట్లు తెలిపారు. లైసెన్స్ కలిగి ఉన్న మెడికల్ షాపుల్లోనే మందులను విక్రయించాలని, కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయించాలని సూచించారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే నాణ్యత లేని, గడువు ముగిసిన మందులను విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ


భీమ్‌రావ్‌పల్లిలో విగ్రహాన్ని ఆవిష్కరించిన రఘునందన్‌రావు

చేగుంట, ఫిబ్రవరి 15: నార్సింగి మండల భీమ్‌రావ్‌పల్లి గ్రామంలో గురువారం ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో నెలకొల్పిన శివాజీ విగ్రహాన్ని దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆవిష్కరించారు. ఛత్రపతి శివాజీని యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో దుబ్బాక అసెంబ్లీ బీజేపీ కో కన్వీనర్ చిలకమర్రి గోవింద్, చేగుంట మండలాధ్యక్షుడు చింతల భూపాల్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

తూప్రాన్ పట్టణంలో ఇసుక డంపుల సీజ్

తూప్రాన్, ఫిబ్రవరి 15: తూప్రాన్ పట్టణంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను రెవెన్యూ, పోలీసు అధికారులు గురువారం సీజ్ చేశారు. తూప్రాన్ పట్టణంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎస్ఐ శివానందం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో ఇసుక నిల్వలపై దాడులు చేశారు. అక్రమంగా నిలువ చేసిన 12 ట్రాక్టర్ల ఇసుకను గుర్తించి సీజ్ చేశారు. నిలువ చేసిన ఇసుక గూడురు కరుణాకర్‌గౌడ్, భక్తుల యాదాగౌడ్‌లకు చెందినదిగా గుర్తించారు.

బొంతపల్లి పాలకవర్గ సభ్యులకు సన్మానం


మాజీ పాలకవర్గాన్ని సన్మానించిన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

గుమ్మడిదల, ఫిబ్రవరి 15: బొంతపల్లిలో గురువారం గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ ఆలేటి నవీనాశ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మానం చేసి, వీడ్కోలు పలికారు. ప్రజలు ఆశీర్వదిస్తేనే ప్రజాప్రతినిధులుగా కొనసాగుతారని ఎంపీపీ సద్ది ప్రవీణభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ నవీనాశ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సురభి నాగేందర్‌గౌడ్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సద్ది విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సంజీవరెడ్డి, మాజీ వార్డు సభ్యులు సురభివినోద్‌గౌడ్, చాకలి వినోద్, నాయకులు రమేష్, చక్రపాణి, మహేష్, హరిశంకర్ పాల్గొన్నారు.

జెన్వాడలో దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

హత్నూర, ఫిబ్రవరి 15: జెన్వాడలో దళితులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించి, బాధితులకు రక్షణ కల్పించాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆవుల మల్లేశం డిమాండ్ చేశారు. గురువారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. శంకర్‌పల్లి మండలం జెన్వాడ గ్రామంలో దళితులపై దాడికి పాల్పడిన ఆర్ఎస్ఎస్, బీజేపీ గుండాలు, వీరికి సహకరించిన పెత్తందారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జెన్వాడలో చర్చిపై దాడి జరుగుతుందని తెలుసుకున్న దళితులు ఆపడానికి ప్రయత్నం చేస్తే వారిపై విచక్షణ రహితంగా రాళ్లతో ఇనుప రాడ్లతో సుమారు 300మంది దాడి చేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు.

మోడల్ స్కూల్‌లో సమస్యలను పరిష్కరించాలి

వట్‌పల్లి, ఫిబ్రవరి 15: మండల పరిధిలోని పోతులబొగుడ మోడల్ స్కూల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు ప్రిన్సిపాల్ మల్లికకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, మైదానం తదితర సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో బజరంగ్‌దళ్ జిల్లా విద్యార్థి ప్రముఖ్ పెట్లోళ్ల అరవింద్, విశ్వహిందూ పరిషత్ మండలాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పెద్దగోళ్ల రాజు, విద్యార్థి ప్రముఖ్ మధుసూదన్, సహ ప్రముఖ్ శ్రీకాంత్, మండల గోరక్షక్ వంశీరెడ్డి, నాయకులు రవి, సతీష్, పాండు తదితరులు ఉన్నారు.

పాంబండ ఉన్నత పాఠశాలలో స్వయంపాలన

శివ్వంపేట, ఫిబ్రవరి 15: మండలంలోని పాంబండ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు స్వయంపాలన నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి విద్యాబోధన చేశారు. డీఈవోగా దీపిక, హెచ్ఎంగా మధు, ఎంఈవోగా స్వాతి, పీఈటీలుగా మహేష్, రోశయ్య, ఉపాధ్యాయులుగా అక్షయ, అనూష, కీర్తన, మానస, సంధ్య, సౌమ్య, స్పందన, శ్రీలత, శృతి, స్వప్న, స్వాతి తదితరులు వ్యవహరించారు. ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మోహన్‌రావు, సీనియర్ ఉపాధ్యాయులు శ్రీధర్‌రావు పర్యవేక్షించారు.

రైతుల అభిప్రాయ సేకరణ

శివ్వంపేట, ఫిబ్రవరి 15: మండలంలోని చెన్నాపూర్, పెద్దగొట్టిముక్ల గ్రామాల్లో కాళేశ్వరం కాలువ నిర్మాణంలో భాగంగా గురువారం రైతులతో సమావేశమై అభిప్రాయాలను సేకరించారు. తహసీల్దార్ శ్రీనివాస్‌చారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కాలువ కోసం సేకరించనున్న భూములకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. సమావేశంలో ఆర్ఐ కిషన్ పాల్గొన్నారు.

కంకర క్రషర్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోండి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 15: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలో నిర్వహిస్తున్న అక్రమ క్రషర్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డి కలెక్టరేట్ ఏవో పరమేశంకు గురువారం వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. సర్వే నంబర్ 116లో ప్రభుత్వం కేటాయించిన భూ పరిమితికి మించి తవ్వకాలు చేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ డైరీ ఆవిష్కరణ

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 15: వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ గాయత్రీదేవీ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని జిల్లా కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్(ఐఎన్‌టీయూసీ-3194) డైరీని గురువారం ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు గుండయ్య, కార్యదర్శి ఈర్న భాస్కర్‌రావు, నాయకులు రవికుమార్, యాదుల్లా, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, ముంతాజ్‌అలీ, భాస్కర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది

రామాయంపేట, ఫిబ్రవరి 15: రామాయంపేట 108 అంబులెన్స్ సిబ్బంది తమ నిజాయితీని చాటుకున్నారు. బుధవారం రాత్రి నార్సింగికి చెందిన వ్యాపారి నరేష్ బైక్ నుంచి పడిపోగా.. ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అయితే ఆ సమయంలో అతడి వద్ద ఉన్న రూ.4లక్షల నగదు అంబులెన్స్ వాహనంలోనే పడిపోయింది. గుర్తించిన సిబ్బంది స్థానిక పోలీసులకు తెలిపి, నగదును గురువారం నరేష్‌కు అందజేశారు. నగదును అందజేసిన 108 సిబ్బందిని పలువురు అభినందించారు.

లైబ్రరీని అందుబాటులోకి తేవాలి

నర్సాపూర్, ఫిబ్రవరి 15: నర్సాపూర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయాన్ని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు పాఠకులు మాట్లాడుతూ.. రెండు గదులతో లైబ్రరీ కొనసాగుతుండడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. నిర్మాణం పూర్తయి ప్రారంభానికి నోచుకోని ఆధునిక గ్రంథాలయాన్ని అందుబాటులోకి తేవాలని చైర్మన్‌ను కోరారు.

సంగారెడ్డి డీపీవోగా సాయిబాబా



సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 15: సంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారిగా తాండ్లే సాయిబాబా గురువారం బాధ్యతలు స్వీకరించారు. మెదక్ జిల్లా పంచాయతీ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న సాయిబాబాను సంగారెడ్డి జిల్లాకు ప్రభుత్వం బదిలీ చేయగా.. గురువారం బాధ్యతలు చేపట్టారు.

జహీరాబాద్ డీఎస్పీగా రామ్మోహన్‌రెడ్డి



జహీరాబాద్, ఫిబ్రవరి 15: జహీరాబాద్ డీఎస్పీగా రామ్మోహన్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా ఎక్సైజ్ విభాగంలో పనిచేస్తున్న రామ్మోహన్‌రెడ్డి జహీరాబాద్ డీఎస్పీగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తామన్నారు. గత రెండున్నరేళ్లుగా జహీరాబాద్ డీఎస్పీగా పనిచేసిన రఘు హైదరాబాద్ ఇంటిలిజెన్స్ విభాగానికి బదిలీపై వెళ్లారు.

నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా జైత్‌రాంనాయక్

నర్సాపూర్, ఫిబ్రవరి 15: నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా గురువారం జైత్‌రాంనాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు పనిచేసిన వెంకట్‌గోపాల్ బదిలీపై తూంకుంటకు వెళ్లారు. ఆయన స్థానంలో జైత్‌రాంనాయక్ బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్‌తో పాటు మేనేజర్ మధుసూదన్, ఇతర సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.


బొల్లారం కమిషనర్‌గా మంగతాయరు

జిన్నారం: బొల్లారం మున్సిపల్ కమిషనర్‌గా మంగతాయరు గురువారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న మంగతాయరు బొల్లారం మున్సిపల్ కమిషనర్‌గా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆర్వో శ్రీధర్, సిబ్బంది స్వాగతం పలికారు.

రామాయంపేట కమిషనర్‌గా దేవేందర్

రామాయంపేట: రామాయంపేట మున్సిపల్ కమిషనర్‌గా ఎం.దేవేందర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కామారెడ్డి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. తన ఛాంబర్‌లో మేనేజర్ శ్రీనివాస్ నుంచి బాధ్యతలు స్వీకరించారు.

వెల్దుర్తి ఎంపీడీవోగా జగదీశ్వరచారి



వెల్దుర్తి, ఫిబ్రవరి 15: వెల్దుర్తి ఎంపీడీవోగా జగదీశ్వరచారి గురువారం బాధ్యతలు చేపట్టారు. నిజాంపేట ఎంపీడీవోగా విధులు నిర్వహించిన జగదీశ్వరచారి వెల్దుర్తికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ సిద్దిపేట జిల్లాకు బదిలీ అయ్యారు.

విచారణ చేయకుండా ఫౌతి చేసిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

హత్నూర, ఫిబ్రవరి 15: మండలంలోని తుర్కలఖానాపూర్ గ్రామ శివారులో తన భర్త పేరున ఉన్న భూములను ఎలాంటి విచారణ చేయకుండా హత్నూర తహసీల్దార్ ఏకపక్షంగా ఫౌతి మార్పు చేశారని మేడ్చల్ జిల్లా నిజాంపేట పట్టణానికి చెందిన గండని బుజ్జి ఆరోపించింది. ఈ మేరకు బుధవారం ఆమె తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన కూడా చేసింది. గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు కె.ప్రభాకర్‌రావు ఆశ్రయించి, న్యాయం చేయాలని కోరింది. అయన ఆదేశాలతో కార్యదర్శి జె.హనుమంతరావు మహిళకు న్యాయ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. భూమి ఏకపక్షంగా ఫౌతి మార్పు విషయమై సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డిని సంప్రదించగా.. ఫిర్యాదు చేస్తే విచారణ చేసి న్యాయం చేస్తామన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

చిన్నశంకరంపేట/నిజాంపేట, ఫిబ్రవరి 15: ప్రత్యేక పారిశుధ్య ముగింపు కార్యక్రమంలో భాగంగా నిజంపేట మండలం కల్వకుంట గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహించి తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ భిక్షపతి పాల్గొన్నారు. చిన్నశంకరంపేట మండలంలోని గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ శానిటేషన్ పనులు గురువారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సాదాసీదాగా వట్‌పల్లి సర్వసభ్య సమావేశం


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కృష్ణవేణి

వట్‌పల్లి, ఫిబ్రవరి 15: వట్‌పల్లిలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఈ సమావేశానికి ఎంపీపీ పత్రి కృష్ణవేణి అధ్యక్షతన వహించారు. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు సకాలంలో జారీ చేయాలని ఎంపీటీసీ నర్సింహులు సభ దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులు, నిరుద్యోగులు, యువకులు వివిధ రకాల పరీక్షలకు హాజరయ్యే అవకాశాలు ఉన్నందున వారికి ధ్రువీకరణ పత్రాలు ఎంతో అవసరమని, జాప్యం చేయకుండా సకాలంలో అందించాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రావును కోరారు. కాగా సభకు హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శశిప్రభ, జడ్పీటీసీ పత్రి అపర్ణ పాల్గొన్నారు.

పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలపై విచారణ జరిపించండి

● **సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్**

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 15: జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. ప్రమాదాలకు కారణమవుతున్న పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట సీపీఎం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్‌చెరు మండల పాశమైలారం పారిశ్రామికవాడలో రెండు రోజుల క్రితం పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించి వారి కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పరిశ్రమల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కలెక్టర్ చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏవో పరమేశంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య, జీ.సాయిలు, నాయకులు యాదగిరి, నర్సింహులు, బాగారెడ్డి, నాగభూషణం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

● **టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్**



సమావేశంలో మాట్లాడుతున్న దొంత నరేందర్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 15: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ డిమాండ్ చేశారు. గురువారం మెదక్‌లోని సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నూతన పెన్షన్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు, ఆదాయ పన్ను పరిమితి పెంపు తదితర సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య పిలుపు మేరకు శుక్రవారం భోజన విరామ సమయంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో జిల్లాలోని ఉద్యోగులందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఐక్యతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ నెల 17న శనివారం సంఘ భవనంలో నిర్వహించనున్న స్టాండింగ్ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, కోశాధికారి చంద్రశేఖర్, అసోసియేట్ అధ్యక్షుడు ఇక్బాల్‌పాషా, ఉపాధ్యక్షులు ఫణిరాజ్, ఫజులొద్దీన్, వివిధ యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన అన్నారం నాయకులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 15: మండలంలోని అన్నారం ఎంపీటీసీ (1) లక్ష్మి గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎంపీటీసీ లక్ష్మితో పాటు తన కుమారుడు బాలకిషన్, గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మెడిపల్లి పాపయ్య, బేగరి యాదగిరి, డప్పు శ్రీనివాస్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పుట్ట నర్సింగరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఐదు సంవత్సరాలుగా బీఆర్ఎస్‌లో ఉండి పార్టీ అభివృద్ధికి పని చేస్తే సరైన గుర్తింపు దక్కకపోవడంతోనే కాంగ్రెస్‌లో చేరినట్లు ఎంపీటీసీ లక్ష్మి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, మాజీ మండలాధ్యక్షులు మద్ది వీరారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మద్ది ప్రతాపరెడ్డి, ఎంపీటీసీలు నాగేందర్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, బొల్లారం మున్సిపల్ కార్పొరేటర్ చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ జయశంకర్‌గౌడ్, వీరేశం, మహిపాల్‌రెడ్డి, నాగేష్ పాల్గొన్నారు.


కాటా శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన అన్నారం ఎంపీటీసీ లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు